క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ప్రోగ్రామ్ కన్వీనర్ సి. సూర్యచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్ లోని ప్రభావతి గార్డెన్స్‌లో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పెద అవుటపల్లికి చెందిన డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యులతో పలు వ్యాధులకు సంబంధించి ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పోషకాహారంతోనే సంపూర్ణం ఆరోగ్యం



పాములపాడు(పెదపారుపూడి): పోషక విలువ కలిగిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పెదపారుపూడి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి అన్నారు. మండలంలోని పాములపాడు శివారు దూళ్లవాని ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి పాలు తాగిస్తే రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు పోషకవిలువ కలిగిన ఆకు కూరలు తీసుకోవాలన్నారు.

498 మందికి వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: స్థానికంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం 498 మందికి వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు, దంత సమస్యలకు ఏలూరు సెయింట్ జోసఫ్ డెంటల్ వైద్యులు, గుండె సంబంధ వ్యాధులకు విజయవాడ సీవీఆర్ మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ వైద్యులు తమ సేవలను అందించారు. అనంతరం ఉచిత మందులను పంపిణీ చేశారు.

వెంకటేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు పోటెత్తారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

'వాహన మిత్ర'తో ఆటో డ్రైవర్లకు లబ్ధి



పామర్రు: వాహన మిత్ర పథకంలో భాగంగా ఆటో డ్రైవర్లకు అందజేస్తున్న ఆర్థిక సాయంతో లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో వాహన సేవ కార్యక్రమం నియోజకవర్గ స్థాయిలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల ఆటో డ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లో రూ.15వేలు జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ నాటక మండల చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఏఎంసీ చైర్మన్ జన్ను శోభన్‌బాబు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి పాల్గొన్నారు.

స్వచ్ఛ పాఠశాలగా ఆరుతెగళపాడు జెడ్పీ స్కూల్

కలిదిండి(కైకలూరు): జిల్లా స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ జెడ్పీ ఉన్నత పాఠశాలగా కలిదిండి మండలం ఆరుతెగళపాడు పాఠశాల ఎంపికైంది. ఈ మేరకు శనివారం అధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. ఇదే మండలంలో ఉత్తమ స్వచ్ఛ రైతుబజారుగా కలిదిండి రైతుబజార్, ఉత్తమ స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్‌గా కలిదిండి మండలం సానారుద్రవరం గ్రామాలు ప్రథమ స్థానాల్లో నిలిచాయి.

7 నుంచి ఆటల పోటీలు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్‌-14 బాల, బాలికల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పోటీల కార్యనిర్వాహక అధ్యక్షులు ఎ. సునీల, కార్యదర్శి డి. నాగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగ, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 7న బాలికలు, 8న బాలుర విభాగాల్లో, 9న బాల, బాలికలకు అథ్లెటిక్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఎంట్రీ, మధ్యాహ్న భోజన ఫారంలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో సంతకాలు చేయించి అందజేయాలని సూచించారు.

దుర్గమ్మతల్లీ పాహిమాం..

వైభవంగా అమ్మవారి ఊరేగింపు



గుడివాడలో అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

గుడివాడ టౌన్: స్థానిక నీలామహల్ రోడ్డులో వేంచేసియున్న శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి పురవీధుల్లో నగర సంకీర్తన జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పునీత్ శర్మ, శివరామకృష్ణ మాట్లాడుతూ నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిసిన సందర్భంగా ఈ రథోత్సవం నిర్వహించామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమతో స్వాగతం పలికారు.

ఘనంగా మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం

మండవల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా శనివారం శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ప్రతిమ ఉన్న వాహనాన్ని ఇంటింటికీ తీసుకెళ్లారు. స్వామికి టెంకాయ, బియ్యం, నగదు సమర్పించుకున్నారు.



మండవల్లిలో మల్లేశ్వరస్వామ గ్రామోత్సవం

వెంకటాపురంలో అన్నసమారాధన

కలిదిండి(కైకలూరు): కలిదిండి మండలం వెంకటాపురంలో చింతాలమ్మ తల్లీ ఆలయం వద్ద దసరా మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు 2000 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా మహిళా విభాగ కమిటీ ఉపాధ్యక్షురాలు నంబూరి శ్రీదేవి, పార్టీ నాయకులు నంబూరి బాబీ, కరేటి భాస్కరరాజు, పాము నాగబాబు, మారగాని భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని దేవపూడి విజయదుర్గాంబ ఆలయంలో విజయదశమి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు దాసరి భగవాన్‌దాస్ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలు విజయవంతంగా ముగిసిన కారణంగా అమ్మవారికి కలశంతో నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా భగవాన్ దాస్ దంపతులను సత్కరించారు. స్థానిక సర్పంచ్ దాసరి కాశీఅన్నపూర్ణ, ఊటుకూరు సర్పంచ్ దూసనపూడి శ్రీను, ఉల్లంకి నగేష్, దాసరి రమేష్ పాల్గొన్నారు.

దుర్గమ్మ తెప్పోత్సవం

కైకలూరు: దసరా మహోత్సవాల ముగింపు సందర్భంగా రాచపట్నంలో దుర్గమ్మ తెప్పోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. డీజే సౌండ్స్, రంగులు, నృత్యాలతో అమ్మవారి విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. వైఎస్సార్ సీపీ ఈసీ సభ్యులు, మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి బీవీ.రావు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాచపట్నం గ్రామపెద్దలు చేబోయిన నేతాజీ, బాలాజీ, బుసనబోయిన శివ రామకృష్ణ, నాగనబోయిన నాగరాజు, యలవర్తి శివాజీ, బోడావుల చక్రవర్తి, మహేష్, రాజేష్, చిన్నోడు ప్రసాద్, నీలపాల అనిల్, తమనాల శివాజీ పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

కైకలూరు: దసరా మహోత్సవాలు ముగించుకుని కైకలూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ తల్లి పురవీధుల్లో శనివారం ఊరేగారు. సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 3 వరకు దేవీ శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహించారు. చివరి రోజు ఆలయం నుంచి అమ్మవారి ఊరేగింపు ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు పయిడిమర్రి రమేష్, పెనుమూడి నాగ వెంకటరామ గంగాధరరావు, శ్యామ్ ప్రసాద్, మాల్యాద్రి, కొండలు, మణికంత, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వెంకటాపురంలో చింతాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారికి కలశంతో పూజలు చేస్తున్న భగవాన్‌దాస్ దంపతులు



కైకలూరు మండలం రాచపట్నంలో బీవీ రావును సత్కరించిన గ్రామస్తులు

ప్రజలందరికీ దుర్గమ్మ ఆశీస్సులు

కైకలూరు: దుర్గమ్మ ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ చేరాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ఆటపాకలో దేవీ శరన్నవరాత్రి వార్షిక మహోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం భారీ అన్నసమారాధన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎన్నార్ మాట్లాడుతూ ఏటా దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, నాయకులు పంజా రామారావు, సమయం అంజి, చొప్పాల రాము, తమ్మిశెట్టి కొండ, కన్నా బాబు, పెద్ది రాజు, వేమన నాగరాజు, సుబ్రహ్మణ్యం, తోట జ్యోతి, ఓడరేవుల ఏసుబాబు, పోతన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



ఆటపాక అన్నసమారాధనలో వడ్డిస్తున్న డీఎన్నార్

తాగునీటి పరీక్షలు తప్పనిసరి

కలిదిండి(కైకలూరు): తాగునీటిని వారానికి ఒకసారి పరీక్షించాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కలిదిండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శనివారం జరిగింది. ఎంపీడీఓ ఆర్.ఫణింద్ర సభా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యం, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులతో వాట్సాప్ గ్రూపును క్రియేట్ చేసి, నీటి పరీక్షలను పోస్టు చేయాలన్నారు. తహసీల్దారు పదేపదే సర్వసభ్య సమావేశాలకు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో మైక్రో వాటర్ ఫిల్టర్లకు నిధులు కేటాయిస్తామన్నారు. విద్యకు ప్రాధాన్యం కల్పించడం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులకు మండల పరిషత్‌లో ప్రత్యేక నిధులు కేటాయించామన్నారు. పడమటిపాలెం సర్పంచ్ సానా మీనాసరస్వతీ రెవెన్యూ అధికారులు సమయానికి సేవలు అందించడం లేదని ఫిర్యాదు చేశారు. కొండంగి ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు ఐసీడీఎస్ సిబ్బంది ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. కలిదిండి డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు మాట్లాడుతూ సంతోషపురం, భాస్కరరావుపేట, అమరావతి, మూలలంక పంట కాల్వల వెంబడి ఆక్రమణలతో పాటు వ్యర్థ పదార్థాలను నీటిలో వదులుతున్నారన్నారు. మండలంలో 139 మంది ఉపాధ్యాయుల కొరత ఉందని ఎంఈఓలు రామలక్ష్మీ, శ్రీనివాసరావులు తెలిపారు. ఎటువంటి సమాచారం అందించకుండా సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీపీ ఉమామహేశ్వరరావు ఎంపీడీఓ ఫణింద్రను కోరారు.



కలిదిండి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు

ముదినేపల్లి రూరల్: ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక విద్యకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని స్థానిక స్వామ్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపురెడ్డి సత్యనారాయణ అన్నారు. గత విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన ఐటీఐ విద్యార్థులకు శనివారం ప్రిన్సిపాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ విద్యార్థులకు అనతికాలంలోనే ఐటీఐ విద్యతో పరిశ్రమల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు అప్రెంటీస్ పూర్తిచేసి పరిశ్రమల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ కె హరిత, సీఈఓ ఓలేటి మణిభీమరాజు, ఎం.ఉమామహేశ్వరరావు, డి కృష్ణమోహన్, శివ, వి.విజయదుర్గ పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలి

మచిలీపట్నంటౌన్: ఆత్మ గౌరవం, సమానత్వం సాధనకు కులవివక్ష నిర్మూలన కోసం సమరశీల ఉద్యమాలకు కేవీపీఎస్ కార్యకర్తలు సిద్ధం కావాలని జిల్లా అధ్యక్షుడు బుర్రె రాజు పిలుపునిచ్చారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం 28వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక రాజుపేటలో ఆ సంఘ మండల కార్యదర్శి పేటేటి రాజు కేవీపీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఆత్మగౌరవం, సమానత్వం దళితుల సామాజిక వివక్షత నుంచి కాపాడుకునేందుకు కేవీపీఎస్ ఏర్పడిందన్నారు. మండల కార్యదర్శి పేటేటి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మిరియాల ఆనంద్ బెనర్జి, నాయకులు వసంతరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కొడాలి శర్మ, సీఐటీయూ జిల్లా నాయకులు బూర సుబ్రహ్మణ్యం, టీ చంద్ర పాల్ తదితరులు పాల్గొన్నారు.



తాళం వేసిన ఇంట్లో చోరీ

రూ.88వేలు, పావు కేజీ వెండి అపహరణ



ఉరుటూరు (పామర్రు): ఉరుటూరు గ్రామంలో తాళం వేసిన ఇంట్లో దొంగలుపడి బీరువాలో ఉన్న నగదు, వెండి వస్తువులను దోచుకుపోయిన సంఘటనపై శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు ఉరుటూరుకు చెందిన మున్నంగి శివకుమారిని ఆమె కుమార్తె నంబూరు కల్యాణిరెడ్డి ఆమె ఉంటున్న కావలి గ్రామానికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఆ ఇంటి పని మనిషి ఇల్లు ఊడ్చేందుకు వచ్చింది. ఇంటి తలుపులు తీసి ఉండటం గమనించి, ఈ విషయాన్ని గ్రామ పెద్దలకు తెలియజేసింది. గ్రామస్తులు పరిస్థితిని చూసి కల్యాణికి ఫోన్ చేసి తెలియజేశారు. గ్రామానికి చేరుకున్న బాధితులు ఇంట్లో బీరువా తలుపులు తీసి ఉండటం, సీక్రెట్ లాకర్‌ను పగలుగొట్టి దానిలో ఉన్న రూ.88వేల నగదు, సుమారు పావు కిలో వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో శనివారం ఉదయం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పామర్రు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. కాగా గ్రామంలో గత 35 ఏళ్లుగా దొంగతనం జరిగిన దాఖలాలు లేవు. ప్రస్తుతం జరిగిన ఈ చోరీతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ఆటో డ్రైవర్లకు నమూనా చెక్కు పంపిణీ

కైకలూరు: ఆటో, మాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తోందని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు అన్నారు. కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా నియోజకవర్గంలో 1,189 మంది లబ్ధిదారులకు రూ.15,000 చొప్పున నమూనా చెక్కును శనివారం అందజేశారు.

లక్ష్య నిర్దేశనతో విజయం సాధ్యం



ఉయ్యూరు: విద్యార్థులు లక్ష్య నిర్దేశనతో కష్టిస్తే విజయం సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో ఉయ్యూరు విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు కైవసం చేసుకున్నారు. క్లాసికల్ ఫ్రీస్టయిల్ డ్యాన్స్‌లో మైథిలి ప్రథమ స్థానం సాధించింది. ధూళిపూడి శేషగిరిరావు పర్యవేక్షణలో ఇన్‌స్ట్రుమెంట్ మ్యూజిక్‌లో సాయి రాఘవ ప్రథమ, సబ్‌జూనియర్స్ విభాగంలో ధనస్య, హేమ, కార్తీక్ కుమార్ ప్రథమస్థానంలో నిలిచారు. ప్రతిభావంతులైన విద్యార్థులను శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ జాస్తి రామారావు, పంద్రాజు చిరంజీవి అభినందించారు.

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయండి

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

పామర్రు: డీఎస్సీలో నూతన ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్థానిక ప్రగతి కోచింగ్ సెంటర్‌లో నూతన ఉపాధ్యాయుల ఓరియంటేషన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనదన్నారు. విద్యార్థుల మనోభావాలను తెలుసుకుని పాఠాలు బోధించాలన్నారు. అప్పుడే విద్యార్థులు ఉపాధ్యాయుల బోధనపై ఆసక్తి పెంచుకుంటారన్నారు. కార్యక్రమంలో ప్రగతి కోచింగ్ సెంటర్ అధినేత పూర్ణ చంద్రరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

పామర్రు: ప్రతిఒక్కరికీ హెచ్‌ఐవీపై అవగాహన అవసరమని ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సూపర్‌వైజర్ బడుగు రాకేష్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఇగ్నోర్ చేయవద్దు మరొక్కసారి గుర్తు చేసుకోండి' కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సురక్షిత పద్ధతులు పాటించేందుకు హెచ్‌ఐవీ ఉన్న వారిపై వివక్ష తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎక్కువ మంది పరీక్షలు చేసుకునేందుకు ముందుకు వచ్చేలా నాకో ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. 2017 యాక్టు ప్రకారం హెచ్‌ఐవీ సంక్రమించిన వారిని ఎవరైనా చులకనగా చూడటం గానీ హేళన చేయడం గానీ చేస్తే టోల్ ఫ్రీ నంబరు 1097కి కాల్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం పీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కె కోటేశ్వరరావు, పీ నమరయం, జీ మురళీ, ఏ కుమార్, పీ యానాదయ్య, గంగాధరరావు, క్లస్టర్ లింక్ వర్కర్సు కె వినయ్‌కుమార్, పీ దేవి పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న బడుగు రాకేష్

మానవ మనుగడకు జంతువులు అవసరం



రైతులకు పశుపోషకాలను అందజేస్తున్న వైద్యులు, వైద్యాధికారులు



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సత్యేంద్ర, డైరెక్టర్ రామలింగేశ్వరరావు

గుడివాడ టౌన్: సమాజంలో జంతువుల ప్రాముఖ్యత వాటి ప్రాధాన్యత మానవ మనుగడలో ఎంతో అవసరమని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ఎన్‌సీహెచ్ నరసింహరావు అన్నారు. శనివారం స్థానిక పశువైద్యశాలలో ప్రపంచ జంతు దినోత్సవాన్ని పురస్కరించుకుని పశువైద్యులకు, పశు పోషకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల వలన మానవ మనుగడ, ఈ భూగోళ ఆరోగ్యం, శక్తినిచ్చే ఆయువులు తదితర అంశాలపై మాట్లాడారు. జంతువుల వలన పరిసరాల సమతుల్యం చేయుటకు, వ్యవసాయ దిగుబడికి కావాల్సిన బలం ఇచ్చుటకు ముఖ్యమైన ప్రాణులు అవుతాయని పేర్కొన్నారు. పశు పోషణ, వాటి సంరక్షణపై అవగాహన అవసరం అన్నారు. కార్యక్రమంలో గుడివాడ పశువైద్యశాల డీడీ డాక్టర్ పి.రత్నశ్రీ, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు. అనంతరం పశు సంరక్షణకు అవసరమైన మినరల్స్, డీవార్మింగ్ మందులు రైతులకు అందజేశారు.

పెదముత్తేవిలో..

పెదముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలం పెదముత్తేవి గ్రామంలో ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. కృష్ణాశ్రమంలోని గోశాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు విచ్చేశఖూరు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి డాక్టర్ మౌర్య సత్యేంద్ర మాట్లాడుతూ ప్రాణులను రక్షించటంతో పాటు ప్లానెట్‌ను కాపాడటం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. జంతువుల సంక్షేమం అంటే కేవలం ప్రాణులకు ఆహారం, నీరు, ఆశ్రయం కల్పించడం మాత్రమే కాదన్నారు. వాటి హక్కులను కాపాడుతూ వాటికి చేయాల్సిన సేవను, మనుగడకు అవసరమైన ఆపేక్షను కల్పించడం కూడా మన బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో ఏహెచ్ఏ ప్రభావతి , హెచ్ఏలు శ్రీను, భాస్కర్, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ టౌన్: రానున్న సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు కావాల్సిన ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం డివిజన్ స్థాయి వ్యవసాయాధికారులు, తహసీల్దార్లు, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వరిపంట పూర్తయిందన్నారు. భారీగా ధాన్యం ఉత్పత్తి వస్తున్న నేపథ్యంలో రైతులకు ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తేవాలన్నారు. అందుకు కావాల్సిన అన్ని వసతులు కల్పించాలని పేర్కొన్నారు. వాటి అవసరాలను గుర్తించి అధికారుల దృష్టికి తెస్తే కావాల్సిన ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తుందని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో గుడివాడ తహసీల్దార్ కిరణ్‌కుమార్‌తో పాటు ఏడు మండలాల తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం

ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయండి

ఉయ్యూరు: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో ఈనెల 7న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి కె.రాజేంద్రప్రసాద్ కోరారు. ఉయ్యూరు సీఐటీయూ కార్యాలయంలో శనివారం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.ఇమ్మానుయేలు మాట్లాడుతూ నాలుగు డీఏలను విడుదల చేయాలని కోరారు. ఏకీకృత సర్వీసురూల్స్‌లో ఉన్న సమస్యను పరిష్కరించి, పదోన్నతులు కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో ప్రతినిధులు బి.లంకేష్, బీవీ రమణ, సురేష్, లక్ష్మణరావు, శ్రీధర్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా పోస్టరును ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

గన్నవరం సబ్‌జైలును సందర్శించిన జిల్లా జడ్జి

గన్నవరం: స్థానిక సబ్‌జైలును శనివారం జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. గోపి సందర్శించారు. తొలుత సబ్‌జైలులోని సదుపాయాలను, ఖైదీల బ్యారక్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడిన ఆయన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత సమాజంలో మంచి వ్యక్తులుగా మెలగాలని చెప్పారు. జైలులో ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.